క్లుప్తంగా

రేపటి నుంచి 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ'

అమలాపురం టౌన్‌: స్థానికంగా వైఎస్సార్‌ సీపీ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమాలు ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకూ 30 వార్డుల్లో జరుగుతాయని పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ పినిపే శ్రీకాంత్‌ పాల్గొనే ఈ వారం రోజుల పాటు జరిగే వార్డుల వారీ షెడ్యూల్‌ను బులినాని గురువారం విడదల చేశారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటలకు ఇంటింటా మొదలయ్యే ఈ కార్యక్రమాలకు పార్టీకి చెందిన మున్సిపల్‌ కౌన్సిలర్లు, పార్టీ వార్డుల ఇన్‌చార్జులు, వార్డు సచివాలయ కన్వీనర్లు, బూత్‌ కమిటీల కన్వీనర్లు, సోషల్‌ మీడియా వారియర్స్‌, గృహ సారథులు, పార్టీ నియోజకవర్గ, జిల్లా స్థాయి నాయకులు విధిగా హాజరై విజయవంతం చేయాలని బులినాని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



సాల్మన్‌రాజును సత్కరిస్తున్న సర్పంచ్‌ చిన్నవరాజు తదితరులు

ఉప్పలగుప్తం: స్థానిక పంచాయతీ పరిధి పేరాయిచెరువు ఎంపీయూపీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కె.సాల్మన్‌రాజును హెచ్‌ఎం శివరామ్‌ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. సర్పంచ్‌ కడిమి చిన్నవరాజు, ఎంఈఓలు కె.కిరణ్‌ బాబు, ఎస్‌.సత్యకృష్ణ, పీఎంసీ చైర్మన్‌ పెయ్యల వెంకట్రాజు, ఉపాధ్యాయులు దుశ్యాలువాతో అభినందించారు. ఉపాధ్యాయుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

సుబ్బాలమ్మ దేవస్థానం చైర్మన్‌గా వీరన్న



అప్పన వీరన్న

అమలాపురం టౌన్‌: అమలాపురం పట్టణ దేవతగా కొలువైన సుబ్బాలమ్మ, నూకాలమ్మ, రాజ్యలక్ష్మి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకుడు అప్పన వీరవెంకట భైరవ స్వామి (వీరన్న) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయ శాఖ నుంచి ఉత్తర్వులు గురువారం వచ్చాయి. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా వీరన్నతోపాటు కమిటీ సభ్యులుగా ఒంటెద్దు వీరవెంకట సత్య నారాయణ, వాడ్రేవు సరోజ, గంటి నాగలక్ష్మి, వసుపులేటి రామకృష్ణ, సరిదే నాగ రాజకుమారి, ఆశపు శ్రీచాముండేశ్వరి, బొల్లోజు మణి శ్రీకాంత్‌, అరిగెల చంద్రశేఖర్‌, ఎక్స్‌అఫీషియో సభ్యునిగా గిత్త శ్రీను నియమితులయ్యారు. వీరన్న అమలాపురం పట్టణ ఆర్యవైశ్య సంఘంలో కీలకంగా సేవలు అందిస్తున్నారు. ఆయన ప్రస్తుతం వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పనిచేస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పూజలు



పిల్లంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద హోమాలు చేస్తున్న రుత్విక్కులు

తాళ్లరేవు: పిల్లంక గ్రామంలో పవిత్ర గౌతమీ గోదావరి తీరాన పుష్కరఘాట్‌ వద్ద వేంచేసి ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయ జీర్ణోద్ధరణ, కళాపకర్షణ కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. సుమారు 130 ఏళ్ల కిందట ఆలయ దాత, అనువంశిక ధర్మకర్త భూపతిరాజు తిరుపతిరాజు నిర్మించిన ఈ ఆలయాన్ని పునర్నిర్మించాలని గ్రామస్తులు సంకల్పించారు. ఈ నేపథ్యంలో తిరుపతిరాజు ముని మనుమడు సాగి భీమేశ్వర రాజు, సాగి బాబ్జీరాజు, చింతలపాటి శ్రీనివాస రాజు, సాగి వేణు, తోలేటి శ్రీనివాసు, సాగి శివరామరాజు తదితరుల ఆధ్వర్యంలో వేద పండితులు వేలూరి వెంకట కామేశ్వరశర్మ పర్యవేక్షణలో రుత్విక్కులు విశేష హోమాలు, పూజలు చేశారు. ఆలయాన్ని అద్భుతంగా నిర్మించేందుకు భక్తులు సహాయ సహకారాలు అందించాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో కాకర్లపూడి కృష్ణంరాజు, హరికృష్ణ, లోవరాజు, కనుమూరి రాంబాబు, సాగి సతీష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ చట్టాలపై అవగాహన ఉండాలి

యానాం: దివ్యాంగుల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరచుకోవాలని మల్టీడిజిబుల్‌ ప్రాజెక్ట్‌ కోఆర్డినేటర్‌ నాయుడు అన్నారు. గురువారం స్థానిక బీచ్‌ రహదారిలో ఉమా ఎడ్యుకేషనల్‌ అండ్‌ టెక్నికల్‌ సొసైటీ వికలాంగుల పాఠశాలలో బహుళ వైకల్య వ్యక్తులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, వివిధ పథకాల గురించి వివరించారు. ఫిజియోథెరపిస్ట్‌ విజయదుర్గ, సభ్యులు సుశీల, స్కూల్‌ ఇన్‌చార్జి కె.శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడక.. నాట్లు పడక

- సాగునీటి కోసం రైతన్నల ఎదురుచూపులు
- పట్టించుకోని ఇరిగేషన్‌ అధికారులు



పల్లంకుర్రు బొంతువారి పేట వద్ద ఇంజిన్‌తో పొలాలకు నీటి తోడకం



పల్లంకుర్రు బొంతువారి పేటలో సాగునీరు అందక నాట్లు వేయని వరి చేలు

కాట్రేనికోన: అన్నదాతకు అన్నీ కష్టాలే.. అడుగడుగునా ఆటంకాలే.. విత్తు నుంచి పంట చేతికందే వరకూ వ్యయప్రయాసలే.. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతన్న పరిస్థితి మరింత దయనీయంగా మారింది. నియోజకవర్గంలో తొలకరి నాట్లు వేసేందుకు మడులలో వరి నారు సిద్ధంగా ఉన్నా సాగునీరు అందక భూములు ఖాళీగానే ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌ సాగుకు నీరు అందక నాట్లు వేయలేని గడ్డు పరిస్థితి వచ్చిందని, గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని వాపోతున్నారు. పంట కాలువల ఆధునీకరణ పనులు సకాలంలో పూర్తి చేసి సాగునీరు ఇచ్చి ఉంటే వరి నాట్లు పూర్తయ్యేవని అంటున్నారు. పంట కాలం ఆలస్యం కావడంతో పంట చేతికి వచ్చేసరికి తుపాన్లు బెడద నుంచి తప్పించుకోలేమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాట్రేనికోన మండలంలో సుమారు 4,100 ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉండగా, సుమారు రెండు వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. చెయ్యేరు, పెనుమల్లే, బంటుమిల్లి, ఉప్పూడి, కాట్రేనికోన, కుండలేశ్వరం, తిమ్మాపురం, వేట్లపాలెం, గెద్దనాపల్లి, కొప్పిగుంట, దొంతికుర్రు, కందికుప్ప, పల్లంకుర్రు, కాట్రేనికోన రేవువారి పేటకు వెళ్లే రోడ్డు వెంబడి పొలాలకు సాగునీరు అందక నాట్లు వేయలేదు. పంట కాలువలు గుర్రపుడెక్క, చెత్త, పూడికతో నిండిపోవడం, పూడికలు తొలగించక శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. అందే పరిస్థితి మిగతా మండలాల్లోని శివారు ప్రాంతాల్లో ఉంది. పంట పొలాలకు సాగునీటి కోసం ఇంజిన్లతో తోడుకోవాల్సిన దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. కౌలు రైతులు నాట్లు వేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారుల అలసత్వంతో సాగునీరు అందడం లేదని అంటున్నారు.

ఆదిలోనే అదనపు ఖర్చు

ఇప్పటికే సాగులో ఖర్చులు పెరిగాయి. ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చు రెట్టింపు అయ్యింది. ఇది చాలదు అన్నట్లు అదనపు ఖర్చులతో తడిసిమోపెడు అవుతున్నాయి. నారుమడులు ఎదిగిపోవడం, నాట్లు వేసేందుకు సాగునీరు అందక పోవడంతో రైతులు చేసేది లేక అదనపు ఖర్చు అయినప్పటికీ ఇంజిన్లతో నీటిని తోడుకోవాల్సి వస్తుంది. కందికుప్ప, పల్లంకుర్రు పంట కాలువలో సరిపడా నీరు లేక కాలువ నుంచి చేలకు వెళ్లే పంట బోదెలకు రైతులు ఉమ్మడిగా ఖర్చులు భరించి ఇంజిన్లతో సాగునీరు తోడుకుంటున్నారు. వర్షాకాలం తుపాన్లతో రైతులకు పంట చేతికి వస్తాదో లేదో తెలియదు కానీ సాగునీటి కోసం ప్రారంభంలోనే అధిక ఖర్చు చేయాల్సి వస్తుందని పలువురు అంటున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి సాగునీరు సక్రమంగా అందించేందుకు తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

> **ఇంజిన్లతో నీటిని తోడుతున్నాం**
>
> అదనపు ఖర్చు అయినప్పటికీ సాగునీరు అందక వరి నాట్లు వేసుకునేందుకు ఇంజిన్లతో నీటిని తోడుకుంటున్నాం. వర్షాకాలంలోనే తొలకరి పంటకు సాగునీరు ఇబ్బందులు ఎన్నడూ చూడలేదు. ఈ పంట పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదు.
>
> –నాతి రాజు, పల్లంకుర్రు

చంద్రబాబువన్నీ మోసపూరిత హామీలు

ప్రజలకు వివరించేందుకే 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ'



గుండెపూడిలో క్యూఆర్‌ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న శ్రీకాంత్‌, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ తదితరులు

అల్లవరం: ఎన్నికల ముందు మోసపూరిత హామీలిచ్చి చంద్రబాబు గద్దెనెక్కారని, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌ పినిపే శ్రీకాంత్‌ అన్నారు. 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' మూడో రోజు కార్యక్రమం ఎస్‌.పల్లిపాలెం, సామంతకుర్రు, గుండెపూడి గ్రామాల్లో గురువారం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కోఆర్డినేటర్‌ పినిపే శ్రీకాంత్‌, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఎన్నికల హామీలను ఓ క్యూఆర్‌ కోడ్‌లో నిక్షిప్తం చేశారన్నారు. స్మార్ట్‌ ఫోన్‌ ద్వారా క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేస్తే కూటమి నేతలు ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నారో అవగతం అవుతుందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మూడు గ్యాస్‌ సిలెండర్లు, ఫ్రీ బస్సు, ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ. 3 వేల నిరుద్యోగ భృతిని విస్మరించారని అన్నారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ మాట్లాడుతూ సూపర్‌ సిక్స్‌ పథకాలు అమలు చేస్తామంటూ చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అడుగడుగునా ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రేషన్‌ డోర్‌ డెలివరీ చేశారని, కూటమి ప్రభుత్వంలో డోర్‌ డెలివరీ విధానాన్ని పూర్తిగా ఎత్తివేశారన్నారు. వందలాది మంది వితంతువులు పెన్షన్‌ కోసం ఎదురు చూస్తున్నా కొత్త పెన్షన్ల మంజూరు ఊసేలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ. 10 వేల జీతం ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా వలంటీర్ల ఊసే లేదని అన్నారు. అనంతరం శ్రీకాంత్‌ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలసి క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేసి చంద్రబాబు మోసాలను మహిళలకు వివరించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ రుద్రరాజు నానిరాజు, జిల్లా ఆర్గనైజింగ్‌ కార్యదర్శి చింతా రామకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు చెదళ్ల వాసుదేవుడు, నాయకుడు తిక్కా ప్రసాద్‌, సర్పంచులు రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, ఎంపీటీసీ సభ్యులు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, రాజేశ్వరి, కర్రి సత్య, మాకే కృష్ణమూర్తి, గ్రామ కమిటీ అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు, కర్రి శ్రీను, గుంటూరి కృష్ణంరాజు, నాయకులు గుంటూరి సత్యనారాయణరాజు, కొపనాతి వెంకటేశ్వరరావు, పినిపే ప్రకాష్‌, సూర్యప్రకాష్‌, కొనుకు బాబూరావు, కడలి లక్ష్మణరావు, పులుసుగంటి గంగాధర్‌, రెడ్డినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని మరచిన కూటమి ప్రభుత్వం



గొల్లవిల్లిలో క్యూఆర్‌ కోడ్‌తో ఉన్న బ్రోచర్‌ను మహిళకు అందజేస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

ఉప్పలగుప్తం: ఎన్నికల ముందు ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు గద్దెనెక్కాక సంక్షేమాన్ని పూర్తిగా మరిచారని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. గొల్లవిల్లి, భీమనపల్లి గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జీ అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. చంద్రబాబు ఎన్నికల ముందు జగన్‌ కంటే ఎక్కువ పథకాలు ప్రవేశపెడతానని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని గాలికొదిలేశారని వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు బాబ్జీ మాట్లాడుతూ కొత్త పథకాలను ప్రవేశపెట్టకపోగా, ఇప్పుడు ఉన్న పథకాలను తొలగించాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. దీనిపై ప్రజల తరపున పోరాటం చేసేందుకు వైఎస్సార్‌ సీపీ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కడిమి చిన్నవరాజు, పెయ్యల రాజ్‌కుమార్‌, జొన్నాడ శ్రీదుర్గ, యర్రంశెట్టి రామచంద్రరావు, పార్టీ జిల్లా కార్యదర్శులు బడుగు మేరీకుమారి, పొగాకు శ్రీను, మండల బీసీ సెల్‌ అధ్యక్షుడు యనమదల పల్లంరాజు, ఆర్టీఐ విభాగం మండల అధ్యక్షుడు పోలిశెట్టి వీర్రాజు, గ్రామ కమిటీల అధ్యక్షులు బడుగు గణేష్‌, మేడిశెట్టి సూరిబాబు, సలాది సతీష్‌, ఆకుల చిన్నీ, పార్టీ నాయకులు వీరవెల్లి చినబాబు, సలాది శివాజీ, సుంకర బుజ్జి, యాళ్ల చిన్నా, జొన్నాడ చిన్నీ, రామపురెడ్డి నాగు, మానే దుర్గ, ఇళ్ల కృష్ణ, కాట్రు కృష్ణ బూసారపు శ్రీను, జినిపే మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ గ్రామాల్లో పనులు ప్రారంభించాలి

యానాం: ఎస్సీ గ్రామాల్లో వివిధ పనులకు మంజూరైన ఆదిద్రావిడ సంక్షేమ, ఎమ్మెల్యే ల్యాడ్‌ నిధులను ఖర్చు చేయాలని గురువారం ఆర్‌ఎల్‌పీ జనసాయగ పెరవై యానాం శాఖ అధ్యక్షుడు సబ్బతి శ్రీనివాసరావు ఆర్‌ఏఓ మునిస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ గ్రామాలకు సంబంధించి ఆదిద్రావిడ, ఎమ్మెల్యే ల్యాడ్‌ నిధులు ఇప్పటికే మున్సిపాలిటీకి బదిలీ అయ్యాయని, అయితే ఇప్పటివరకూ టెండర్లు పిలవ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం డ్రైనేజీల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, దరియాలతిప్ప ఓపెన్‌ ఆడిటోరియంలో విద్యుత్‌ లైట్ల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా వారాహి అఖండ హోమం



వారాహి అఖండ హోమం నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్‌: స్థానిక శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్యాత్మిక కేంద్రం స్థానిక ఎన్టీఆర్‌ మార్గ్‌లోని పోలీస్‌ పెరేడ్‌ గ్రౌండ్స్‌ వద్ద సాయికృష్ణనగర్‌లో కొత్తగా ప్రణవనాద నిలయాన్ని గురువారం ప్రారంభించింది. ఈ సందర్భంగా రెండు రోజులుగా వారాహి అఖండ హోమాన్ని అహోరాత్రులు నిర్వహించింది. హోమం ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రణవనాద నిలయంలో గురువారం నిర్వహించిన అన్న సమారాధనలో వందలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులు హోమ గుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహించారు. గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు, గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్యాత్మిక కేంద్రం అధ్యక్షురాలు నాగకనకదుర్గ, సభ్యులు నూకల కుమారి, గొవ్వాల అచ్యుతరామయ్య, చాగంటి ప్రసాద్‌ తదితరులు పాల్గొని భక్తులకు సేవలు అందించారు.

నవోదయలో ప్రవేశానికి ఆహ్వానం

యానాం: స్థానిక జవహర్‌ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్‌లో ప్రవేశానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురువారం ప్రిన్సిపాల్‌ ఎస్‌.శరశ్చంద్రకీర్తి ఓ ప్రకటనలో తెలిపారు. సీబీఎస్‌ఈ పద్ధతిలో ఇంటర్‌ చదవడానికి మిగిలిన ఉన్న సీట్ల కోసం అభ్యర్థులు ఆగస్టు 10 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఇంటర్‌ మొదటి, ద్వితీయ సంవత్సరాలు విద్యాలయలో అభ్యసించవచ్చన్నారు.

విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌కు శంకుస్థాపన

అమలాపురం టౌన్‌: స్థానిక వడ్డిగూడెంలో 33/11 కేవీ విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌కు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గురువారం శంకుస్థాపన చేశారు. పట్టణంలోని మూడు సబ్‌ స్టేషన్లకు తోడు వడ్డిగూడెంలో విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ అందుబాటులోకి వస్తే పట్టణంలో నాణ్యమైన విద్యుత్‌ సరఫరా అవుతుందని ఎమ్మెల్యే అన్నారు. అముడా చైర్మన్‌ అల్లాడ స్వామి నాయుడు, ట్రాన్స్‌కో కన్‌స్ట్రక్షన్స్‌ ఈఈ వై.విజయానంద్‌, ట్రాన్స్‌కో ఆపరేషన్‌ జిల్లా ఎస్‌ఈ బి.రాజేశ్వరి, ఈఈ ఆపరేషన్‌ కె.రాంబాబు పాల్గొన్నారు.

సబ్‌ కోర్టు జడ్జికి వీడ్కోలు



సబ్‌ జడ్జి సుబ్రహ్మణ్యన్‌కు జ్ఞాపిక అందిస్తున్న న్యాయవాదులు, సిబ్బంది

యానాం: యానాం సబ్‌ కోర్టులో సబ్‌ జడ్జిగా విధులు నిర్వహించి బదిలీ అయిన ఆర్‌.సుబ్రహ్మణ్యన్‌కు గురువారం కోర్టు హాలులో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. రెండు నెలల పాటు సబ్‌ జడ్జిగా విధులు నిర్వహించిన సుబ్రహ్మణ్యన్‌ అరక్కోణం బదిలీ అయ్యారు. అనంతరం ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ సలాది దుర్గాశ్రీనివాస్‌, సీనియర్‌ న్యాయవాదులు కమిడి విజయకుమార్‌, నటరాజన్‌, లీగల్‌ ఎయిడ్‌ కౌన్సిల్‌ పేర్ని ఆదినారాయణ, భ్రమరాంబిక, స్వరాజ్యలక్ష్మి, పడాల సబ్బారావు, నారాయణ, రామకృష్ణ, ఉషా, భవాని పాల్గొన్నారు.

జీతాలు సక్రమంగా అందించండి



సమావేశంలో మాట్లాడుతున్న లోవలక్ష్మి

అమలాపురం రూరల్‌: మధ్యాహ్న భోజన పథక కార్మికులకు సక్రమంగా జీతాలు అందించాలని ఈ పథక జిల్లా అధ్యక్షురాలు సీహెచ్‌ లోవలక్ష్మి అన్నారు. అమలాపురంలో గురువారం మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంత పెట్టుబడి పెడుతున్నా ప్రతి నెలా బిల్లులు పూర్తిస్థాయిలో అకౌంట్‌కు రావట్లేదని, పని భారం పెరుగుతుందని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను ప్రభుత్వం పెంచాలని కోరారు. రోజంతా కష్టపడి పనిచేస్తే ఒక మధ్యాహ్న భోజనం కార్మికురాలికి రోజుకు రూ. 100 మాత్రమే మిగులుతుందని, శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని, గ్యాస్‌ ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథక కార్మికుల జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్‌ లోవలక్ష్మి, జె.సత్యనారాయణ, కోశాధికారిగా గోవిందరాజు, ఉపాధ్యక్షుడిగా ఎంవీ రమణ, జాయింట్‌ సెక్రటరీగా సుబ్బలక్ష్మి, దుర్గభవానిని ఎన్నుకున్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



ముమ్మిడివరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముమ్మిడివరం: డెంగీ మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం ముమ్మిడివరంలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద డీఎంహెచ్‌ఓ డి.దుర్గారావుదొర ప్రారంభించగా, స్థానిక పోలీస్‌ స్టేషన్‌ వరకూ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్‌పీఓ రాజ్‌కుమార్‌, వైద్య సిబ్బందితో డెంగీ నివారణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయంలో డెంగీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించి, వ్యాధి నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో సబ్‌ యూనిట్‌ ఆఫీసర్‌ రామారావు, హెల్త్‌ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అమలాపురం రోళ్లపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

అమలాపురం రూరల్‌: సమాచార హక్కు చట్టంపై రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రాజెక్ట్‌ మేనేజర్‌శ్రీనివాస్‌ అన్నారు. కోనసీమ జిల్లా అమలాపురం ప్రకృతి వ్యవసాయం కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై సమీక్ష చేశారు. రోళ్లపాలెంలో వ్యవసాయ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అడిషనల్‌ ప్రాజెక్ట్‌ మేనేజర్‌ సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీ నాయకుడికి పరామర్శ



విత్తనాల రాజేశ్వరరావును పరామర్శిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి పితాని బాలకృష్ణ

కాట్రేనికోన: పి.లక్ష్మీవాడలో వైఎస్సార్‌ సీపీ నాయకుడు విత్తనాల రాజేశ్వరరావు భార్య అర్జమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సతీ వియోగంతో బాధపడుతున్న రాజేశ్వరరావును వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర కార్యదర్శి పితాని బాలకృష్ణ గురువారం మండల కన్వీనర్‌ నల్లా నరసింహమూర్తితో కలసి పరామర్శించారు. అర్జమ్మ చిత్రపటానికి వైఎస్సార్‌ సీపీ నాయకులు పితాని బాలకృష్ణ, నల్లా నరసింహమూర్తి, చొల్లంగి వెంకటేశ్వర్లు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సోషల్‌ ఆడిట్‌ పారదర్శకంగా చేయండి

అమలాపురం రూరల్‌: ఉపాధి హామీ పథకం ద్వారా అమలాపురం మండలంలో జరిగిన పనులపై పారదర్శకంగా సోషల్‌ ఆడిట్‌ చేయాలని సంబంధిత సోషల్‌ ఆడిట్‌ బృందానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సూచించారు. అమలాపురం రూరల్‌ మండలంలో 2024 ఏప్రిల్‌ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకూ జరిగిన రూ.11 కోట్ల పనులపై సోషల్‌ ఆడిట్‌ నిర్వహించేందుకు వచ్చిన సామాజిక తనిఖీ బృంద సభ్యులు గురువారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు.

విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌ శాఖ అధికారులు

సాక్షి ఇంపాక్ట్‌

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ కర్రిచెరువులో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ పనిచేయక లోఓల్టేజీ సమస్య తలెత్తుంది. దీనిపై విద్యుత్‌ అధికారులు స్పందించడం లేదని స్థానికంగా బుధవారం నిరసన తెలిపారు. ఈ మేరకు 'సాక్షి' దినపత్రికలో గురువారం లోఓల్టేజీ సమస్యపై ప్రచురించిన కథనానికి విద్యుత్‌ అధికారులు స్పందించారు. ఏఈ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించారు.

మెప్మా బజార్‌ ప్రారంభం



మెప్మా బజార్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్‌ రవివర్మ తదితరులు

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద మెప్మా బజార్‌ను కమిషనర్‌ పి.రవివర్మ శుక్రవారం ప్రారంభించారు. అర్బన్‌ మార్కెట్‌లో ఎస్‌హెచ్‌జీ మెంబర్స్‌ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో చీరలు, పంజాబీ శారీస్‌లు, పచ్చళ్లు, తినుబండారాలు, జ్యూట్‌ బాగ్స్‌, ఫ్లవర్‌ వాజ్‌లు, కొవ్వొత్తులు, పేపర్‌ ప్లేట్‌లు, హెర్బల్‌ జ్యూయలరీ, వన్‌గ్రామ్‌ గోల్డ్‌ ఆభరణాలను విక్రయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ములపర్తి బాలకృష్ణ, కడలి నాగు, కట్టా సత్తిబాబు, రెడ్డి సుధీర్‌, ఏఈ కె.శ్రీనివాస్‌, మెప్మా సీఎంఎం భాస్కర్‌, ఒ.దేవకీదేవి, ఆర్‌పీలు, సచివాలయ, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ అంతరాయం

అమలాపురం రూరల్‌: ఈదరపల్లి వద్ద వంతెన నిర్మాణ పనుల కారణంగా విద్యుత్‌ స్తంభాలు, లైన్ల మార్పుతో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ రాంబాబు తెలిపారు. నల్లవంతెన, మున్సిపాలిటీ రా వాటర్‌, మెయిన్‌ రోడ్‌, ముమ్మిడివరం గేటు, పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. అదేవిధంగా చల్లపల్లి సబ్‌ స్టేషన్‌, ఓల్డ్‌ ముమ్మిడివరం, ఉప్పలగుప్తం పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, మరమ్మతుల కారణంగా అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తామన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపుతో..

ముమ్మిడివరం: చెట్ల కొమ్మల తొలగింపు, సబ్‌ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 33 కేవీ చల్లపల్లి, ఓల్డ్‌ ముమ్మిడివరం, ఉప్పలగుప్తం విద్యుత్‌ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని 11 కేవీ ఫీడర్లపై వివిధ గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ రాంబాబు వివరించారు. ఈ అంతరాయానికి విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిస్వార్థ సేవలతో గుర్తింపు

యానాం: ప్రభుత్వ ఉద్యోగిగా నిస్వార్థ సేవలు అందించడం ద్వారా ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని ఆర్‌ఏఓ మునిస్వామి అన్నారు. గురువారం మహిళా, శిశు సంక్షేమ శాఖలో 39 ఏళ్ల పాటు గిరియాంపేట, పరంపేట తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పాలెపు లక్ష్మీనారాయణమ్మను సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.